నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: దేవేందర్‌నగర్ ఫీడర్ మెయింటెన్స్ పనుల నిమిత్తం గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు. దేవేందర్‌నగర్, అంబేద్కర్‌నగర్, గౌతమినగర్, రాజీవ్‌నగర్, అన్నపూర్ణ కాలనీ, వీరారెడ్డికాలనీ, రాజీవ్‌నగర్, ఇందిరానగర్, జ్యోతినగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సరస్వతినగర్ ఫీడర్ పరిధిలో..

సరస్వతినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వేణుగోపాల్ వెల్లడించారు. సరస్వతినగర్, శ్రీనగర్, విజయపురికాలనీ, శ్రీలక్ష్మినగర్, ఉదయ్‌నగర్, అశోక్‌నగర్, ప్రశాంత్‌నగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

అల్వాల్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా భూదేవినగర్ సబ్‌స్టేషన్ 11కేవీ ఆదర్శ్‌నగర్ ఫీడర్ పరిధిలో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆదర్శ్‌నగర్, వైష్ణవిమాత టెంపుల్, ఈస్ట్ వెంకటాపురం, ఎంఈఎస్ కాలనీ, ఎస్‌ఏవో, నారాయణ్‌పురం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారులు తెలిపారు.

మురుగు సమస్యను పరిష్కరించండి



కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, కృష్ణారెడ్డినగర్‌లో మురుగు వీధుల వెంట పరుగులు తీస్తుంది. తరచుగా డ్రైనేజీ పొంగిపొర్లడంతో రోడ్లన్నీ మురుగుతో నిండిపోతున్నాయి. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో తరచుగా మురుగు సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇక వర్షాకాలంలో కాలనీరోడ్లు జలమయంకావడంతో ఇళ్లలోకి వర్షపునీరు చేరి ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. దీనిపై అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించి మురుగు సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలంలోని గుడిసెల తొలగింపు

బోడుప్పల్: ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలసిన 4 గుడిసెలను బుధవారం మేడిపల్లి రెవెన్యూ అధికారులు జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా మేడిపల్లి ఆర్ఐ రాకేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలను ఎవరైనా కబ్జాచేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణదారులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ఉప్పల్: గుట్టుచప్పుడు కాకుండా ఓ ఇంట్లో పేకాడుతున్న ఆరుగురిని ఉప్పల్ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన బుధవారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ ఇందిరానగర్‌లోని ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్నారన్న సమాచారం మేరకు ఉప్పల్ పోలీసులు దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 39000ల నగదును స్వాధీనం చేసుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మల్లాపూర్: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం నాచారం పారిశ్రామికవాడలోని లిక్కర్ స్పిరిట్ కంపెనీ సమీపంలో బుధవారం లభ్యమైంది. ఎస్సై మైబెలి తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం పారిశ్రామికవాడలో 50 ఏళ్లున్న వ్యక్తి మృతి చెందాడనే సమాచారంతో వెళ్లి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుడి ప్యాంట్‌లో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఆధార్ కార్డు లభించింది. ఆధార్‌కార్డు అరుణ్‌కుమార్ పేరుతో ఉంది. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాల ఆకస్మిక తనిఖీ

ఉప్పల్: ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులే గొప్పగా ఎదుగుతారని హైదరాబాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. పదోతరగతి పరీక్షలు దగ్గరపడుతున్న సందర్భంగా బుధవారం ఉప్పల్ జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఆర్సీ, పాఠశాల రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. పరీక్షలంటే భయపడకూడదని ఏకగ్రతను పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే అన్నిరంగాల్లో రాణించగలుగుతారన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదుకున్నానని చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఉప్పల్ మండల ఎంఈవో రామారావు, ప్రధానోపాధ్యాయులు వేంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

పిల్లర్ల వరకే పరిమితమైన ఫ్లై ఓవర్ పనులు



రహదారి పూర్తయ్యేదెన్నడో ?

- ఓవైపు నిర్మాణ పనులు, మరోవైపు ట్రాఫిక్‌తో తిప్పలు
- అత్వెల్లి నుంచి చెక్‌పోస్టు వరకు నరకం చూస్తున్న వాహనదారులు

మేడ్చల్ పట్టణం మీదుగా వెళ్లే జాతీయ రహదారిపై వెళ్లాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. గతేడాది నుంచి మేడ్చల్‌కు రావాలంటేనే ప్రజలు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది.



జాతీయరహదారిపై నిలిచిపోయిన వాహనాలు

మేడ్చల్: మేడ్చల్ మీదుగా వెళ్లే 44వ జాతీయ రహదారి వాహనాల రద్దీకి సరిపోకపోవడంతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు మేడ్చల్‌లో విస్తరణ పనులు చేపట్టి రోడ్డును ఆధునికరిస్తున్నారు. విస్తరణ, అండర్‌పాస్‌ల నిర్మాణం, ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టారు. నగరంలోని బోయినపల్లి నుంచి మెదక్‌జిల్లా కాళ్ళకల్ వరకు గతేడాది పనులు చేపట్టారు.

రెండు భాగాలుగా పనులు..

కండ్లకోయ రింగు రోడ్డు జంక్షన్ నుంచి బోయిన్‌పల్లి వరకు ఓ భాగం, కండ్లకోయ నుంచి కాళ్ళకల్ వరకు మరో భాగంగా పనులు చేపట్టారు. మేడ్చల్ పట్టణం నడిబోడ్డు నుంచి రోడ్డు వెళ్తుండటంతో అధికారులు విస్తరణ చేపట్టారు. విస్తరణ పనులు పూర్తిచేసి ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేస్తున్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణానికి 72 పిల్లర్లు..

మేడ్చల్ ఐటీఐ నుంచి చెక్‌పోస్టు వరకు ఫ్లై ఓవర్ నిర్మించడానికి 72 పిల్లర్ల నిర్మాణం రోడ్డు మధ్యలో చేశారు. కండ్లకోయ వద్ద , ఈఎంఆర్ఐ, అత్వెల్లి, రేకులబావిల వద్ద అండర్‌పాస్ బ్రిడ్జిల నిర్మాణం, బ్రిడ్జిల విస్తరణ పనులు చేపట్టారు.

నిత్యం ట్రాఫిక్‌జామ్..

రోడ్డు పనులు జరుగుతుండటంతో అత్వెల్లి నుంచి చెక్‌పోస్ట్ వరకు నిత్యం ట్రాఫిక్‌జామ్ అవుతుంది. ప్రధానంగా ఉదయం సాయంత్రం గంటల తరబడి వాహనాలు కదలడం లేదు. కాంట్రాక్టర్ పనుల నిర్మాణం భాగంగా రోడ్డు మధ్యలో పిల్లర్లు నిర్మించి బారికేడ్లు ఏర్పాటు చేశారు. నిర్మాణం జరుగుతున్న కండ్లకోయ రింగురోడ్డు జంక్షన్ నుంచి బోయిన్‌పల్లి వరకు వాహనాలు వెళ్లి ప్రమాదాలు జరగకుండా ఇనుపరేకులు అడ్డంగా పెట్టి పనులు చేస్తున్నారు. దీంతో 4 లైన్ల రోడ్డు సింగిల్‌లైన్ రోడ్డుగా తయారైంది.

ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఇబ్బందులు..

రోడ్డుకు ఇరువైపులా నూతన రోడ్డు నిర్మించకపోవడం, పట్టణంలో ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్న పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం..

రద్దీ సమయాల్లో ఉదయం, సాయంత్రం మేడ్చల్ పట్టణంలో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. జాతీయరహదారి కావడంతో భారీవాహనాల సంఖ్య ఎక్కువగా ఉండటం, స్కూల్ బస్సులు, ఇతర వాహనాలు అధికంగా ఉండటంతో ట్రాఫిక్ నిలిచిపోతుంది.

చలాన్లకే ప్రాధాన్యం..

ట్రాఫిక్ పోలీసులు అక్కడక్కడ కనిపిస్తూ ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నా అధికంగా చలాన్లు వేయడానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పెరుగుతున్న వాయు కాలుష్యం..

బీటీరోడ్డు పూర్తిగా లేకపోవడంతో దుమ్ము రేగుతోంది. వాహనాల తాకిడికి నేలపై ఉన్న దుమ్ము గాల్లో కలుస్తుంది. ఎప్పటికప్పుడు నీళ్లు పోయాల్సి ఉండగా నామమాత్రంగా అక్కడక్కడ నీళ్లు పోసి వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి.

తప్పని ఇబ్బందులు..

రేపటి కష్టాలను తీర్చడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిని అభివృద్ధి చేస్తున్నప్పటికీ కాంట్రాక్టర్ సకాలంలో పనులు పూర్తిచేయకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

నత్తనడకన పనులు..

మేడ్చల్ రోడ్డు ఆధునీకరణ పనులు మార్చిలో ముగియాల్సి ఉండగా 50శాతం పనులు సైతం పూర్తి కాలేదు. కేవలం పిల్లర్ల నిర్మాణం పూర్తి కాగా మిగిలిన పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. రహదారి పనుల జాప్యంపై ఎంపీ ఈటల రాజేందర్ అధికారులు, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్ష నిర్వహించి పనులు నవంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు



మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తామని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. మౌలాలి కమాన్ (గోపాల్ నగర్ ఏరియా) నుంచి జవహర్‌నగర్ వరకు సుమారు రూ.52 లక్షలతో చేపట్టే రోడ్డు విస్తరణ పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా లోతట్టు ప్రాంతం ఉండటంతో వర్షాకాలంలో ఎక్కువ ఇబ్బందులకు గురవుతున్నారని, సీసీరోడ్డు నిర్మాణం పూర్తయితే సమస్య పరిష్కారమవుతుందన్నారు. రంజాన్ పండుగలోపు నిర్మాణ పనులు పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించామన్నారు. దీనివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలుగుతాయన్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, ఈఈ లక్ష్మణ్, డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, వీవీ రజనీకాంత్, కిషోర్, నారాయణ, ముత్యంరెడ్డి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

అల్వాల్: అల్వాల్ డివిజన్ వేణుగోపాల్‌నగర్‌లో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. బుధవారం కాలనీలో మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అల్వాల్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. కాలనీలో మురుగు, పార్కులో ఓపెన్ జిమ్, పారిశుద్ధ్యంపై అధికారులకు వివరించారు. కాలనీ అధ్యక్షులు సాహు, రాధాకృష్ణ, ప్రభ, సరిత, రవి, డాక్టర్ మిట్టల్, ప్రేమ్‌కుమార్, అధికారులు డీఈ ప్రశాంతి, ఏఈ వరుణ్, జలమండలి అధికారి రమేష్, సతీష్, రామారావు తదితరులున్నారు.



వేణుగోపాల్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శాంతి

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ వార్డు కార్యాలయంపై అదనపు అంతస్తు నిర్మాణ పనులను బుధవారం మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. గది నిర్మాణ సంబంధించిన విషయాలపై అధికారులకు సూచనలు చేశారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. మల్లాపూర్ ఏఈ స్రవంతి, బీఆర్‌ఎస్ నేత సాయిజెన్‌శేఖర్, శ్యామ్‌సుందర్, రాపోలు శ్రీను తదితరులున్నారు.

ఎంపీ ఈటలకు ఆహ్వానం



ఎంపీ ఈటలకు ఆహ్వానం అందజేస్తున్న దృశ్యం

రామంతాపూర్ : రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ఈనెల 13 నుంచి నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని బుధవారం ఆలయ ఈవో విజయభారతి ఎఫ్ ట్రస్ట్ మెంబర్ కోట్ల నర్సింహ్మారెడ్డి ఎంపీ ఈటలకు ఆహ్వానం అందజేశారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎంపీ ఆలయ అధికారులకు సూచించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భాస్కర్, అశోక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ సమస్యకు పరిష్కారం

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో సుమారు రూ. కోటి బడ్జెట్‌తో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ మరమ్మతులకు నిధులు మంజూరైనట్లు కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని చలపతి రెసిడెన్సీ వద్ద 100 కేవీఏ, 160 కేవీఏ, గోపాల్‌నగర్ గణేష్ టెంపుల్ వద్ద 100 కేవీఏ, అన్నపూర్ణ హౌసింగ్ సొసైటీ, మిర్జాలగూడ, ఎంకేనగర్, బ్యాంకుకాలనీ, వాణినగర్, భవానీనగర్, చర్చి డీటీఆర్, దయానంద్‌నగర్, సాయిరెసిడెన్సీ, రాజానగర్‌కాలనీ, కల్వర్లు -2, రాజశ్రీ నివాసనగర్, ఐఎస్‌నగర్, జ్యోతినగర్, పోచమ్మ ఆలయం, మల్లికార్జుననగర్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ మరమ్మతులకు నిధులు మంజూరై పనులు కొనసాగుతున్నాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, విద్యుత్ ఏడీఈ చంద్రశేఖర్‌కు కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం మత్తులో యాసిడ్ తాగి..

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మల్కాజిగిరి: మద్యం మత్తులో యాసిడ్ తాగి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలసరస్వతీనగర్‌కు చెందిన బసవరాజు (48) కారుడ్రైవర్. ఈనెల 4న సాయంత్రం 6 గంటలకు ఇంటి నుంచి అతడి భార్య శశికళ తన కుమార్తెతో కలిసి వారి దుకాణానికి వెళ్లింది. ఇంట్లో మద్యం మత్తులో ఉన్న బసవరాజు యాసిడ్ తాగి కేకలు వేయడంతో స్థానికులు భార్యకు సమాచారం అందించారు. వారు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లమని సూచించారు. చికిత్సపొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో పాల్గొనాలి



జయంతిరెడ్డి

ఉప్పల్: యువజన క్రీడల మంత్రిత్వశాఖ రూపొందించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో యువత పాల్గొనాలని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జయంతిరెడ్డి సూచించారు. ఈ మేరకు కళాశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలను రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల నోడల్ జిల్లాగా ఎంపికైందన్నారు. ఈనెల 9 లోగా యువత 'మైభారత్ పోర్టల్' ద్వారా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మార్చి 9వ తేదీ తర్వాత లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించే స్క్రీనింగ్‌లో 150 మంది యువతను ఎంపికచేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 మందిని రాష్ట్రస్థాయికి పంపుతామన్నారు. వారు రాష్ట్ర అసెంబ్లీలో 75 ఏళ్ల భారత రాజ్యాంగం - విధులు, హక్కులు, ప్రగతి అనే అంశంపై ఉపన్యాసం ఉంటుందన్నారు. వారిలో నుంచి ముగ్గురిని ఎంపికచేసి జాతీయస్థాయికి పంపుతారన్నారు. అక్కడ ఒకదేశం- ఒకే ఎన్నికల్లో భాగంగా ప్రజాస్వామ్యాన్ని సరళీకృతం చేయడం, ప్రగతి విస్తరించడం, స్థిరత్వాన్ని నిర్ధారించడం అనే అంశంపై ప్రసంగించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9553355828,7386987603.

నిరుద్యోగులకు చేయూతనందించడం అభినందనీయం

మల్లాపూర్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిరుద్యోగ యువత కోసం ఎంటర్ ప్రీవియర్ ఎమ్మెస్ఎంఈ అవగాహన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నాచారం భద్ర గ్రాండ్ హోటల్‌లో కేంద్రప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ ఈటల, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. ముద్రా రుణాలు, విశ్వకర్మ రుణాలు, మహిళా సంఘాలకు ఇచ్చే రుణాలు, పరిశ్రమల ఏర్పాటు విద్యారుణాలు బ్యాంకుల ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చీఫ్ మేనేజర్ భాస్కర్‌రావు, రఘునాథ్, సుధాకర్, పట్నాయక్, బ్యాంక్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

సమాజ నిర్మాణంలో మహిళలదే కీలకపాత్ర

మల్లాపూర్: సమాజ నిర్మాణంలో మహిళలదే కీలకపాత్ర అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మల్లాపూర్ నెహ్రూనగర్‌లో స్నేహ మహిళా మండలి నెహ్రూనగర్, అశోక్‌నగర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు వివక్షతకు గురవుతున్నామనే అపోహలను వీడి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ముందజంలో ఉన్నారని, మహిళాభివృద్దే దేశాభివృద్ధి అని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే కేక్‌కట్ చేసి మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ నేతలు సాయిజెన్‌శేఖర్, గంధం నాగేశ్వర్‌రావు, మహిళా సంఘం ఆర్పీ మదన, సుజాత తదితరులు పాల్గొన్నారు.



మహిళాదినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

ఆస్తిపన్ను వసూలుకు ప్రత్యేక మొబైల్ టీమ్



బోడుప్పల్: 2024–25 ఆర్థిక సంవత్సర ఆస్తిపన్ను బకాయిల వసూలు కోసం ప్రత్యేక మొబైల్‌టీమ్ (జప్తు వాహనం)ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ శైలజ వెల్లడించారు. బుధవారం బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. 100 శాతం ఆస్తిపన్ను బకాయిల వసూలు కోసం అవసరమైన చర్యల్లో భాగంగా కమిషనర్, రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు మొబైల్ టీమ్‌గా ఏర్పడినట్లు చెప్పారు. దీర్ఘకాలికంగా అధిక మొత్తంలో బకాయిలున్న ఇంటి యజమానులకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు వివరించారు. వారం రోజుల్లోగా చెల్లించకపోతే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం చరాస్తులను జప్తు చేస్తామన్నారు. నల్లా కనెక్షన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్లను తొలగిస్తామన్నారు. బకాయిదారులు సకాలంలో పనులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు.

డంపింగ్‌యార్డును తరలించాలి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్‌లోని డంపింగ్‌యార్డును మరోచోటుకు తరలించాలని స్థానిక కాలనీల వాసులు బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు వల్ల 50 కాలనీల వరకు ఎన్నో సమస్యలు ఎదురౌతున్నాయని, ముఖ్యంగా అనారోగ్యం భారిన పడుతున్నారన్నారు. సాయంత్రం కాగానే దుర్గంధం, దోమలబెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వెంటనే డంపింగ్‌యార్డును మరోచోటుకు తరలించాలని లేదంటే నిరసన చేపడతామని హెచ్చరించారు. స్థానిక నేతలు డోలి రమేష్, పవన్, రాజు, ప్రశాంత్‌రెడ్డి, దిలీప్, విజయ్, శ్రీధర్‌రెడ్డి, రాజేశ్వరి, దాక్షాయణి, అనిత, అర్చన, నవ్యశ్రీ, పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్‌యార్డు వద్ద నిరసన చేస్తున్న కాలనీవాసులు

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



డ్రోన్‌తో రసాయనాలు పిచికారీ చేయిస్తున్న ఎమ్మెల్యే బండారి

ఉప్పల్: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌తో కలిసి నాచారం పెద్దచెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. నాచారం చెరువు హైకోర్టు కాలనీ వద్ద చెరువులో ఆయిల్‌బాల్స్‌ను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గుర్రపు డెక్క, చెత్త, కారణంగా దోమలు విస్తరిస్తున్నాయన్నారు. ఎంటమాలజీ అధికారులతో కలిసి చెరువులో దోమలు వృద్ధిచెందకుండా ఉండేందుకు డ్రోన్ సాయంతో రసాయనాలను పిచికారీ చేయనున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, స్థానికనేతలు కొండల్‌రెడ్డి, వీబీ నర్సింహ, మహేందర్, బాలేందర్, మాస శేఖర్, ఎండీ షఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

రామంతాపూర్ : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఉప్పల్ సర్కిల్ పరిధిలో వివిధ పరీక్ష కేంద్రాల్లో బుధవారం ప్రశాంతంగా జరిగాయి. గురువారం ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయి.

స్వల్ప ఉద్రిక్తత..

ఇంటర్ ఫస్ట్ ఇయర్ తొలి పరీక్ష నేపథ్యంలో బుధవారం రామంతాపూర్‌లోని మేఘా మహిళా జూనియర్ కళాశాల కేంద్రం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. సదరు కేంద్రంలోకి పరీక్ష రాసేందుకు ప్యాడ్‌లను కళాశాల ప్రిన్సిపాల్ అనుమతించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. పోలీసులు జోక్యం చేసుకుని కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. దీంతో ప్రిన్సిపాల్ ఇంటర్మీడియట్ బోర్డు అధికారులతో మాట్లాడి తొలి పరీక్ష ప్రారంభమైనందున గురువారం నుంచి పరీక్ష కేంద్రంలోకి ప్యాడ్‌లను అనుమతిస్తామని ప్రకటించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనను విరమించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలోని వెంకటాపురం, మచ్చబొల్లారం, అల్వాల్ ప్రాంతాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా కేంద్రాల నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.



అల్వాల్ పరీక్ష కేంద్రం వద్ద పరీక్షకు హాజరైన విద్యార్థులు

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

మల్కాజిగిరి: భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట్‌కు చెందిన సుగుణ కుమార్తె ఉషారాణి (36) వాణీనగర్‌కు చెందిన శ్రీరాం అనుష్‌భానుతో 2022లో వివాహమైంది. 2023లో భర్త అమెరికాకు వెళ్లగా తర్వాత భార్య వెళ్లి గతేడాది తిరిగొచ్చి అత్తమామల వద్దే ఉంటుంది. ఈనెల 4న మధ్యాహ్నం ఉషారాణి అత్త నిర్మల సుగుణకు ఫోన్‌చేసి ఇంటికి రమ్మని చెప్పింది. ఆమె వచ్చి చూసేసరికి ఉషారాణి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నిర్మల సోదరుడు రమేష్‌ను పిలిపించి తలుపు పగులగొట్టి చూసేసరికి ఉరేసుకుని కనిపించిందని అత్త తెలిపింది. మృతురాలు రాసిన సూసైడ్‌నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భర్తే వీడియోకాల్ ద్వారా భార్యను వేధించేవాడని, ఇటీవల ఉద్యోగం పోయినప్పటి నుంచి వేధింపులు ఎక్కువయ్యాయని సుగుణ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రజిత

ఉప్పల్: వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం కృషి చేస్తుందని కార్పొరేటర్ ముందుముల రజితాపరమేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం కురుమానగర్‌లో విద్యుత్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులతో కలిసి ప్రారంభించారు. ఇంతకాలంగా సింగిల్ ఫేజ్ కరెంటుతో ఇక్కడి ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారని ఈ సమస్యను అధిగమించేందుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్థానికులు నవీన్‌యాదవ్, తుమ్మల దేవిరెడ్డి, సత్తయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బీరయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.